పిక్కలు పీకేస్తున్నాయి

- గ్రామాల్లో విచ్చలవిడిగా వీధి కుక్కల సంచారం
- నియంత్రణలో అధికారుల విఫలం
- భయపడుతున్న ప్రజలు



ప్రభుత్వాసుపత్రిలో కుక్క కాటుకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది



యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్



గణేష్‌చౌక్ సెంటర్‌లో రాత్రి వేళలో గుంపుగా ఉన్న శునకాలు

నిడదవోలు: కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ జనంపై దాడికి దిగుతున్నాయి. నడిచి వెళుతున్న వాళ్ల కాళ్ల పిక్కలను పీకేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలిత్తిపోతున్నారు. నియోజకవర్గంలో నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువైంది. దీంతో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అధికారులు వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని చేపడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఫలితం ఉండడం లేదు. వార్డుల్లో, సంతమార్కెట్‌లో వీధి కుక్కల సంతానం పెరగడంతో ఎక్కడపడితే అక్కడే గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల పట్టణంలో గాంధీ నగర్ మూడో వీధిలో ఆడుకుంటున్న చిన్నారులపై పిచ్చికుక్క దాడి చేయడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తమ చిన్నారులను రక్షించుకోవడానికి వెళ్లిన తల్లులపై కూడా ఆ కుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామీణ ప్రాంత ప్రజలపై దాడులు కూడా రోజురోజులు పెరిగిపోతున్నాయి. దాడుల్లో గాయపడిన వారు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. రోజుకు 30 నుంచి 20 వరకూ కేసులు నమోదవుతున్నాయని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. కొంతమంది నాటు వైద్యంపై ఆధారపడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో కుక్కకాటుకు జిల్లేడు పాలు పొడవడం వంటి నాటు వైద్యం చేయడంతో ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితిని తెచ్చుకుంటున్నారు. కుక్కకాటును నిర్లక్ష్యం చేస్తే ర్యాబీస్ వ్యాధి వస్తోందన్న విషయం కూడా గ్రామీణ ప్రాంతంలో తెలియకపోవడంతో వారు నిర్లక్ష్యంతో నాటు వైద్యంపై ఆధారపడుతున్నారు.

కుక్క కాటుపై నిర్లక్ష్యం చేస్తే..

వీధి కుక్కల సంచారంతో ప్రజలు భయపడుతున్నారు. నియోజవర్గంలోని ఆయా గ్రామాల్లో ఏ వీధికి వెళ్లినా వీధి కుక్కల పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారులు, మాంసం, చేపల దుకాణాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు, పిల్లలు, మహిళలు రోడ్లు పైకి రావాలంటేనే భయపడుతున్నారు. కొందరు వీధి కుక్కలను సైతం ఆహారమిచ్చి పెంచుతున్నారు. అయితే కుక్కే కదా కరిచింది. తినే ఆహారంలో పత్యం పాటిస్తే సరిపోతుందిలే అనుకుంటే ప్రాణాలే పోగొట్టుకునే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు, వాహనదారులపై వీధి కుక్కల దాడులు ఈ మధ్య కాలంలో అధికమయ్యాయి. వీధుల్లో సంచరిస్తున్న కుక్కల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు రోడ్లపై రావాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో వీధుల్లో సంచరిస్తూ అరుపులతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం

పట్టణంలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంటుందనే విషయం మాదృష్టికి వచ్చింది. వీధి కుక్కల సంతానోత్పత్తి లేకుండా ఆపరేషన్లు చేయించెందుకు చర్యలు తీసుకుంటున్నాం. మంచి ఏజన్సీల ద్వారా ఆపరేషన్లు చేయించాలని చూస్తున్నాం. ఇదీ కాని పక్షంలో వీధి కుక్కలను పట్టుకుని అడవిలో వదిలిపెట్టెందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– టి.కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్, నిడదవోలు

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పెంచుకుంటున్న గొర్రెలు, మేకలు, పశువులు, కోళ్లపై కుక్కలు దాడులు పెరుగుతున్నాయి. పశువుల్ని మేతకు వదిలేటప్పుడు అవి దాడి చేస్తున్నారు. కొన్నిసార్లు పశువుల గాయాలకు కుక్కలే కారణమని తెలియక వైద్యం అందించకపోవడంతో పశువులు మరణిస్తున్నాయి.

ర్యాబిస్ వ్యాధి లక్షణాలు

- జ్వరం, తలనొప్పి, విరేచనాలు, వాంతులు, తలనొప్పి వస్తుంది.
- కాళ్లు చేతులు పడిపోవడం (పక్షవాతం) పిట్స్, పిచ్చిపిచ్చిగా మాట్లాడటం మొదలగు వంటి లక్షణాలు తలెత్తుతాయి.
- మధుమేహం, క్యాన్సర్ వ్యాధి గ్రస్తులు వ్యాక్సిన్ డోస్ తీసుకోవాలి.

జాగ్రత్తలు

- కుక్క కరవగానే వీలైనంత త్వరగా పై నుంచి నీరు ధారగా ఓ ప్రవాహంలా కింద పడుతుండగా అంటే కుళాయి కిందగాని లేదా మగ్‌తో నీళ్లు పోస్తు గాని గాయమైన భాగాన్ని సబ్బుతో కనీసం 15 నిముషాలు శుభ్రంగా కడగాలి.
- గాయానికి ఎలాంటి కట్టూ కట్టకూడదు. ఓపెన్ గానే ఉంచాలి.
- కుక్క కాటుకు ఆహార నియమాలు ఏమీ లేవు
- కరిసిన కుక్కను పది రోజుల పాటు గమనించాల్సి ఉంటుంది. కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడనక్కర్లేదు.
- వాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి. గాయానికి ఎప్పటికప్పుడు డ్రెస్సింగ్ చేయించాలి. ఏఆర్‌వీ వ్యాక్సిన్ 0, 03, 07, 14 రోజుల్లో ఒక డోస్ చొప్పున తీసుకోవాలి.
- కుక్కకాటుతో రేబీస్ వచ్చే అవకాశాలు ఎక్కువ కాబట్టి పైన పేర్కొన్న ప్రథమ చికిత్స ముగిసిన వెంటనే మీ దగ్గరలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకువెళ్లాలి.

క్లుప్తంగా

ఘనంగా కుంతీదేవి జాతర



సూర్యారావుపాలెంలో ప్రత్యేక వాహనంలో కుంతీదేవి ఊరేగింపు

ఉండ్రాజవరం: సూర్యారావుపాలెంలో కుంతీదేవి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో మేళా తాళాలతో, వివిధ వేషధారణలు, ఆర్కెస్ట్రాలతో అమ్మవారిని వైభవంగా పురవీధుల్లో ఊరేగించారు. ఈ జాతరను భక్తులు అధిక సంఖ్యలో వీక్షించారు. గ్రామంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండ్రాజవరం ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మధ్యాహ్నం భోజనంలో నాణ్యత పాటించాలి



తాడిపర్రు ఉన్నత పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

ఉండ్రాజవరం: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ పీఎన్‌డీ.ప్రసాద్ నిర్వాహకులకు సూచించారు. మండలంలో తాడిపర్రు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకంలో వినియోగించే బియ్యాన్ని సోమవారం ఈవోపీఆర్డీ శర్మ, సర్పంచ్ కె.నరేంద్రతో కలసి తహసీల్దార్‌ను పరిశీలించారు. మధ్యాహ్నం భోజన పథకంలో అందించే బియ్యం నాణ్యతలేవని, ఈనెల 3వతేదీన మండల పరిషత్ సమావేశంలో తాడిపర్రు ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. దాంతో దసరా సెలవులు ముగియంతో అధికారులు తాడిపర్రు ఉన్నత పాఠశాల సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సక్సేనా రాజు, శారద జ్యోత్స్న, పాఠశాల హెచ్ఎంలు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బస్సు



అనంతపల్లి శివారు వీరవల్లి టోల్ ప్లాజా వద్ద డివైడర్‌ను ఢీకొన్న బస్సు

నల్లజర్ల: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి శివారు వీరవల్లి టోల్ ప్లాజా వద్ద అన్నవరం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళ్తున్న భవానీల బస్సు డివైడర్‌ను ఢీకొంది. ఆ సమయంలో బస్సులో 27మంది భవానీలు ఉన్నారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు. మరోక బస్సులో వీరంతా విజయవాడ వెళ్లారు.

మహిళల అభ్యున్నతితోనే మెరుగైన సమాజం



నల్లజర్లలో కుట్టు శిక్షణను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల: మహిళల అభ్యుతితోనే మెరుగైన సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సోమవారం నల్లజర్లలో పార్డ్ ఇండియా స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు కుటుంబానికే పరిమితం కాకుండా తాము ఎంచుకున్న రంగాలలో పురుషులను సైతం అధికమించి మహిళలు పోటీ విజయాలను సొంతం చేసుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పల్లిజ్యోతి, గోతం సత్యతేజ, ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, ఎంపీడీఓ సింహాద్రి, ఇన్‌చార్జ్ తహసీల్దారు శాంతిప్రియ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ అజయ్‌బాబు, దూబచర్ల గ్రామకార్యదర్శి బి.రత్నం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడిగా సీమకుర్తి కృష్ణప్రసాద్, అధ్యక్షుడిగా మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా కూరపాటి నాగరాజు, కోశాధికారిగా జీవివి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పచ్చిగోళ్ల శ్రీనివాస్, వీరమళ్ల అనిల్‌కుమార్ ఎస్‌కేఎస్ సత్యనారాయణ, మరో 15 మందిని వివిధ హోదాలలో ఎన్నుకున్నారు. వీరందరితో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు.

కోలాహలంగా అమ్మవారి ఊరేగింపు



దేవరపల్లిలో బాలదుర్గమ్మను హంస వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు



దేవరపల్లి మండలం పల్లంట్లలో రాజరాజేశ్వరీదేవిని రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

దేవరపల్లి: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులు వివిధ అవతారాల్లో విశేష పూజలందుకున్న దుర్గాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను భక్తులు కోలాహలంగా ఊరేగించి జలాశయాల్లో నిమజ్జనం చేశారు. సోమవారం దేవరపల్లిలోని బాలదుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఉదయం ప్రారంభమైన ఊరేగింపు రాత్రి వరకూ సాగింది. ఎంపీపీ కేవీకే దుర్గారావు అమ్మవారికి పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, కమిటీ సభ్యులు ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఊరేగించడానికి గ్రామానికి చెందిన పైడికొండల బుల్లియ్య, రత్నం దంపతులు రూ.25 వేలకు వేలం పాటలో పాడుకున్నారు. మండలంలోని పల్లంట్ల గ్రామంలో వేంచేసిన రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరి ఆలయంలో అమ్మవారిని రథంపై గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పల్లంట్లలో రథంపై కొలువైన రాజరాజేశ్వరీ దేవి



పెద్దేవంలో ఆకట్టుకున్న వేషధారణలు

తాళ్లపూడి: పెద్దేవంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం వద్ద ఏటా కనక దుర్గమ్మను నిలబెట్టి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.ఉత్సవాలు ముగియడంతో అమ్మవారిని ఊరేగించారు. అదేవిధంగా వివిధ రకాల పార్వతీ పరమేశ్వరులు, వినాయకుడు, ఇతర దేవతా మూర్తులు, శక్తి వేషధారణలు ఎడ్ల బళ్లపై పెట్టడంతో ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాల్య వివాహాలతో ఎన్నో ఇబ్బందులు

కొవ్వూరు: బాల్య వివాహాల నిర్మూలనకు మండల, పంచాయతీల స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు సీడీపీవో డి.మమ్మి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. పెళ్లి చేసిన పెద్దలతో పాటు పురోహితులు, పెళ్లికి సహకరించిన అందరిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. లైగింక వేధింపులు, నిర్మూలనకు చర్యలు గురించి వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.తహసీల్దార్ ప్రసాద్, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం



రావిమెట్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు రూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ.11 కోట్లతో అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని సింగవరంలో రూ.16 లక్షలు, కంసాలిపాలెంలో రూ.11.60 లక్షలు, రావిమెట్లలో రూ.15.72 లక్షలు, తిమ్మరాజుపాలెంలో రూ.15.96 లక్షలు, సూరాపురంలో రూ.14.98 లక్షలు, కాటకోటేశ్వరంలో 25.80 లక్షలు, ఉనకరమిల్లిలో రూ.12.80 లక్షలు, తాడిమళ్లలో రూ.32.20లక్షలు, కోరుమామిడిలో రూ.27.05 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు మంత్రి సోమవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు నాణ్యతగా నిర్మించాలని అధికారులకు సూచించారు. రావిమెట్లలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరైయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచులు కొండపల్లి శ్రీనివాస్, కాల్దారి సూర్యకుమారి, కొయ్యల వెంకటేశ్వరరావు, రాధారాణి, గోపమ్మ, ఎంపీటీసీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

గజ్జరంలో...

తాళ్లపూడి: గ్రామాల్లో అభివద్ధి సంక్షేమంపై దృష్టిసారిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని గజ్జరంలో సోమవారం పల్లె పండుగ కార్యాక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సచివాలయంలో అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వెంకట రమణ, సర్పంచ్ గండి రాంబాబు, ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి, స్థానిక నాయకులు కాకర్ల వంశీ, శేషు తదితరుల పాల్గొన్నారు.

ఆటో బోల్తా ఆరుగురికి గాయాలు

కొవ్వూరు: దొమ్మేరు సమీపంలో సోమవారం రోడ్డు గోతులమయంగా ఉండడం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటో ప్రయాణిస్తున్న ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. దొమ్మేరుకి చెందిన కైరా జయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. శ్రీలక్ష్మి, జయంతి, దీపిక, సునీత, కమల, రాజశ్రీలకు స్వల్ప గాయాలైనట్టు ఆయన తెలిపారు. విద్యార్థులను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారన్నారు.

అల్పపీడనంతో ఆందోళన

- పూతదశలో వరిపైరు
- భారీ వర్షాలు కురిస్తే దిగుబడిపై ప్రభావం
- అన్నదాతల ఆవేదన



కడియం మండలంలో ఆరోగ్యంగా ఉన్న వరిపైరు

కడియం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నెల 16 నుంచి 18 వరకూ కోస్తాంధ్రాలో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో గుబులు నెలకొంది. రూరల్ నియోజక వర్గంలో సుమారు ఐదువేల హెక్టార్లకు పైగా వరిసాగు జరుగుతోంది. కడియం మండలంలో 2,623 హెక్టార్లలో రైతులు పండిస్తున్నారు. దీనిలో సుమారు 70 శాతానికి పైగా ఎంటీయూ 7029 (స్వర్ణ) రకం వరినే ఎక్కువగా వేశారు. దిగుబడి బాగుండడం, తెగుళ్లను తట్టుకోవడంతో ఇతర సాధారణ రకాల కంటే మెరుగైన ఫలితాలు కనిపించడంతో దీనిపైనే అధికంగా ఆధారపడుతున్నారు. వీటితో పాటు ఎంటీయూ 1318, బీపీటీ, 126 రకాలను కూడా పలువురు రైతులు సాగు చేస్తున్నారు.

ఈదురు గాలులతో ఇబ్బంది

అత్యధికంగా సాగు చేస్తున్న స్వర్ణ రకం వర్షాలకు కూడా తట్టుకునే శక్తి ఉన్నప్పటికీ ఈదురు గాలులు వీస్తే మాత్రం వరికంకులు నేలనంటే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఒక మోస్తరు వర్షాలతో ఈ అల్పపీడనం దాటిపోతే పర్వాలేదని, అలా కాకుంటే మాత్రం దిగుబడి నష్టాలను ఎదుర్కొవాల్సి వస్తుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. గాలుల ప్రభావం ఉంటే స్వర్ణ రకం వరితో ఇబ్బందేనని భయపడుతున్నారు.

పూత దశలోనే అధికం

ప్రస్తుతం వరి పంట పూతదశలో ఉందని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. మరో 10 నుంచి 15 రోజుల్లో గింజలు పాలుపోసుకునే దశకు చేరతాయంటున్నారు. ప్రస్తుతం పూత దశలో భారీ వర్షాలు కురిస్తే దిగుబడి తగ్గుతుందని భావిస్తున్నారు. ఒక మోస్తరు వర్షాలతో గట్టెక్కితే దిగుబడికి ఇబ్బంది ఉండదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా వరిపంట ఆరోగ్యంగానే ఉందని చెబుతున్నారు.

అనేక సమస్యలు

పంటల సాగుకు రైతులు ప్రకృతితో పాటు, స్థానిక పరిస్థితులతో కూడా పోటీపడాల్సి వస్తోంది. సీజనల్‌లో వర్షాల రాకను ఎవ్వరూ కాదనలేరు. కానీ అలా కురిసిన వర్షపు నీటి కారణంగా పంటలు ముంపు బారిన పడుతుండడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, మురమండ, మాధవరాయుడుపాలెం, దుళ్ల తదితర గ్రామాల్లో వరి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఆయా పంట పొలాలకు సాగు/మురుగు నీరు పారే కాలువల నిర్వహణా లోపాల కారణంగా ప్రస్తుతం అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. దీంతో సమయానికి సాగునీరు అందక, ముంపు వస్తే దిగువకు నీరు పారక రైతాంగం ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ప్రకృతితో పోరాడుతూ సాగు చేయగలుగుతున్నాం గానీ, స్థానికంగా సాగు / మురుగునీటి వసతులు మెరుగుపడక ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. తుపానులు, భారీ వర్షాలు వస్తున్నాయంటే రైతుల్లో భయాందోళనలు నెలకొనడానికి ఈ పరిస్థితులు కూడా ఒక కారణంగా చెబుతున్నారు.

భారీ వర్షాలతో ఇబ్బందే

ప్రస్తుతం గింజలు పాలుపోసుకోవడానికి తగిన విధంగా వరిపైరు ఉంది. ఇప్పుడు గనుక భారీ వర్షాలు కురిస్తే దిగుబడి బాగా పడిపోతుంది. ఒక మోస్తరు వర్షంతో గట్టెక్కితే రైతులకు ఇబ్బందులు తప్పుతాయి.

– టి.కొండయ్య, రైతు, దుళ్ల

ముంపునీటితో నష్టాలు

తుపానులు, వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే ముంపునీరు సక్రమంగా దిగువకు పోయే మార్గాలుంటే రైతులకు భారీ నష్టాలు కలుగకుండా ఉంటాయి. రోజుల తరబడి ముంపునీరు ముందుకు కదలకపోతే మాత్రం నష్టాలు తప్పవు. గతంలో కూడా ఇదే పరిస్థితులను రైతులు ఎదుర్కొన్నారు.

– ఎం.నారాయణ, రైతు, మురమండ